ఈనాడు
నారాయణపేట
గురువారం అక్టోబరు 17, 2024

తరగతులు ప్రారంభించాక సమస్యలు రానీయొద్దు

వైద్యకళాశాలపై సమీక్షలో ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి క్రిస్టినా


జిల్లా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న క్రిస్టినా

నారాయణపేట(పాతబస్టాండ్), న్యూస్‌టుడే : జాతీయ వైద్య కౌన్సిల్ నిబంధనల ప్రకారం వైద్య కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి క్రిస్టినా అధికారులను ఆదేశించారు. తొలి ఏడాదికే కాకుండా ద్వితీయ సంవత్సరం తరగతుల నిర్వహణకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి వైద్యకళాశాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్, టీజీఎంఐడీసీ అధికారులు, వైద్య నిపుణులతో ఆమె కళాశాల నిర్వహణపై సమీక్షించారు. తరగుతులు ప్రారంభించిన తర్వాత మళ్లీ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడన్నారు. మూడో అంతస్తులో బ్లడ్ బ్యాంక్, డయలాసిస్ యూనిట్, ఇతర ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వెనకబడిన ఈ ప్రాంతం వైద్యపరంగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధికార బృందంతో కలిసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, చిన్నపిల్లల దవాఖానాలను పరిశీలించారు. వార్డులలో చికిత్స పొందుతున్న రోగులు, చిన్నపిల్లల తల్లులతో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నదీ తెలుసుకున్నారు. ఫార్మసీ విభాగంలో ఏ మందులు కొరత ఉన్నాయో ఇండెంట్ పంపించాలని ఆదేశించారు. అనంతరం పేట సమీకృత మార్కెట్ సముదాయాన్ని పరిశీలించారు. ఎంఐడీసీ ఎండీ హేమంత్, శిక్షణ కలెక్టర్ గరిమా నరుల, అకాడమిక్ డీఎంఈ శివరాం ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ రాంకిషన్, పాలమూరు వైద్య కళాశాల డైరెక్టర్ డా.రమేశ్, ఎంఐడీసీ చీఫ్ ఇంజినీర్ దేవేందర్ కుమార్, ఈఈ జైపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డా.సౌభాగ్య లక్ష్మి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లికార్జున్ ఉన్నారు.

ఎన్నాళ్ల కల.. నెరవేరింది ఈ వేళ

నర్వకు జూనియర్ కళాశాల మంజూరు


క్రీడామైదానం, కళాశాల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న ప్రభుత్వ భూమి

న్యూస్‌టుడే, నర్వ

మండలకేంద్రంగా ఏర్పాటైన నలభై ఏళ్ల తర్వాత నర్వకు జూనియర్ కళాశాల మంజూరైంది. ఈ కల కోసం గతంలో కళాశాల సాధన కమిటీ ఏర్పాటు చేసుకున్న అఖిలపక్ష నాయకులు ఉద్యమాలు, ఆందోళనలు చేసి రోడ్లెక్కినా ఫలితం దక్కలేదు. ఇక్కడ ఎస్సీ, బీసీ వసతిగృహాలను ఏర్పాటు చేయలేదు. నర్వకు మంజూరైన జ్యోతి బా పులె గురుకుల పాఠశాలను నర్వలో కాకుండా మక్తల్‌లో నిర్వహిస్తున్నారు. మొదటి నుంచి విద్యాపరంగా నర్వకు అన్యాయమే జరిగింది. ఎట్టకేలకు జూనియర్ కళాశాల మంజూరు కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గురుకులానికి స్థలం కేటాయింపు

గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం జ్యోతి బా పులె బాలురు గురుకుల పాఠశాల మంజూరు అయ్యింది. ఇక్కడ సరైన వసతులు లేవనే సాకుతో కొందరి సూచనలతో పాఠశాలను మక్తల్‌కు తరలించారు. గురుకుల పాఠశాల భవనం నిర్మించడానికి ప్రస్తుతం లంకాల శివారులో సర్వే 3.30లో ఏడు ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియకు అడ్డంకులు ఎదురుకాకుంటే మళ్లీ నర్వకే గురుకులం తరలించే అవకాశం ఉంది.

నర్వ శివారులో జాంత్రగుట్ట వద్ద ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 40లో అయిదు ఎకరాల ఏడు గుంటల భూమిని కేటాయించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మైదానంతోపాటు కళాశాల భవనాలను నిర్మించనున్నారు. గుట్టలా ఉన్న భూమిని చదును చేసేందుకు ఎమ్మెల్యే నిధులు రూ.40లక్షలు వెచ్చిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి తరగతులు ప్రారంభమయ్యేలా నిర్మాణం వేగవంతం చేయాలని భావిస్తున్నారు. సరైన రవాణా సదుపాయాలు లేక ఎంతోమంది నిరుపేద విద్యార్థులు పదో తరగతికే పరిమితం అవుతున్న తరుణంలో ఇదో చక్కని అవకాశం.

వచ్చే ఏడాది నుంచి నిర్వహణ



నర్వ మండలం విద్య విషయంలో వెనుకబడి ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కళాశాల మంజూరు కోసం ఫైళ్లు వెంటబెట్టుకుని ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి మంజూరు చేయించాను. పులె గురుకుల భవనం నిర్మాణం కోసం నిధులను తీసుకొస్తా.. వచ్చే విద్యాసంవత్సరం లోపు నిర్మాణ పనులను పూర్తి చేయించి తరగతులు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటాను.

- వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే

వైద్యుల కొరత.. రోగులకు వెత

శిక్షణ పూర్తయి వెళ్లిపోయిన సీనియర్ రెసిడెంట్లు ■ మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో తీవ్ర ఇబ్బందులు


మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు విభాగానికి నిత్యం 250 నుంచి 300 వరకు గర్భిణులు వస్తున్నారు. ప్రసూతి విభాగంలో తగినంత మంది వైద్యులు లేకపోయినా ఐదుగురు సీనియర్ రెసిడెంట్లతో వారికి వైద్య సేవలందేవి. వారి శిక్షణ పూర్తయి వెళ్లిపోవటంతో ఓపీ, ప్రసూతి వార్డు, ప్రసవాల గది, ఆపరేషన్ థియేటర్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి.

న్యూస్‌టుడే, పాలమూరు

మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీనియర్ రెసిడెంట్లు(ఎస్ఆర్‌లు) లేకపోవటంతో వైద్యసేవలు అందించటం కష్టంగా మారింది. వైద్యులతో పాటు రోగులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ వైద్య విభాగాల్లో పీజీ పూర్తిచేసిన వైద్య విద్యార్థులు నిబంధనల ప్రకారం గతేడాది మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సంవత్సరం వ్యవధి శిక్షణకు వచ్చారు. జనరల్ సర్జరీ విభాగంలో 06, జనరల్ మెడిసిన్‌లో 04, ఆర్థోలో 05, పిడియాట్రిక్‌లో 04, రేడియాలజీలో 03, కంటి విభాగంలో 01, సైకియాట్రిలో ఒకరు, అనస్థీషియాలో 07, పల్మనాలజీలో 02, ఈఎన్‌టీలో 02, డెర్మటాలజీలో 02, గైనకాలజీలో ఐదుగురు చొప్పున సీనియర్ రెసిడెంట్లుగా వైద్యసేవలందించారు. వారి శిక్షణ గత నెల 3న పూర్తికావటంతో వారి వెళ్లిపోయారు. వారు వెళ్లిన వెంటనే మరో బ్యాచ్ రావాల్సి ఉంది. సాంకేతిక కారణాల వల్ల వారు రావటం మరో నాలుగైదు నెలలు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోజూ 2వేలకు పైగా రోగులు ఆసుపత్రికి వస్తారు. వారికి 24 గంటల పాటు అందుబాటులో ఉండి సేవలందించే ఎస్ఆర్‌లు ఇప్పుడు లేకుండా పోవటంతో ఉన్న వైద్య సిబ్బందిపైనే పని భారం పెరుగుతోంది.

అన్ని విభాగాల్లోనూ కొరతే.. : జనరల్ ఆసుపత్రిలో, వైద్య కళాశాలలో సేవలందించేందుకు 450 బోధనా వైద్య సిబ్బంది అవసరమైతే 100 మంది వరకు రెగ్యులర్, 150 మంది తాత్కాలిక ప్రాతిపదికన కలిపి మొత్తం 250 మంది బోధనా వైద్య సిబ్బందే పనిచేస్తున్నారు. సరిపడినంత వైద్యులు లేకపోవడంతోనే చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, సైకియాట్రి తదితర విభాగాలకు అధిపతులు కూడా లేరు. కొన్నింట్లో అసోసియేట్లు, మరికొన్నింటిలో సహాయ ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్ఆర్‌లూ లేకపోవటం మరింత ఇబ్బందికరంగా మారింది.

ఈనాడు పరిశీలన

ఉన్నవారితోనే సేవలు.. :
ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉన్నవారితోనే సేవలు అందిస్తున్నాం. ఖాళీల భర్తీకి పలుమార్లు ఉద్యోగ ప్రకటనలు ఇచ్చినా అర్హత కలిగిన వైద్యులు ముందుకు రావడం లేదు. కొత్త ఎస్ఆర్‌లను తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– డా.సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి


స్కానింగ్ పరిశీలిస్తున్న రేడియాలజీ విభాగాధిపతి

రేడియాలజీపై తీవ్ర భారం.. : ఎస్ఆర్‌లు లేక ఎక్కువగా సమస్యలు ఎదుర్కొనేది రేడియాలజీ విభాగమే. ఇందులో కనీసం ఐదుగురు రేడియాలజిస్టులు అందుబాటులో ఉండాలి. రేడియాలజిస్టులు ఆసక్తి చూపక పోస్టులు ఏళ్లుగా భర్తీ కావటం లేదు. విభాగాధిపతి, మరో సహాయ ఆచార్యుడు మాత్రమే సేవలందించాల్సి వస్తోంది. ఆసుపత్రిలో ప్రతి చికిత్సకు స్కానింగ్, ఎక్స్‌రేలు కీలకం. ఈ విభాగంలో గత నెల 3వ తేదీ వరకు ముగ్గురు సీనియర్ రెసిడెంట్లు ఉండేవారు. వారు ఉన్నప్పుడు 200ల వరకు రోగులకు స్కానింగ్ సేవలు అందించేవారు. ఇప్పుడు సీనియర్ రెసిడెంట్లు లేకపోవడంతో 60 నుంచి 80 మంది వరకే సేవలు అందించే పరిస్థితి నెలకొంది. అత్యవసరమున్న వారికి ఆ రోజు ఎక్స్‌రేలు తీస్తున్నారు. మిగతా వారు మరుసటి రోజు రావాల్సి వస్తోంది.

సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు తగవు


నారాయణపేట, న్యూస్‌టుడే : జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేయరాదని ఎస్పీ యోగేశ్‌గౌతం అన్నారు. విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయం, కుల, మత ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టకూడదన్నారు. ఈ తరహా కార్యకలాపాలపై నిఘా ఉందని, గట్టి చర్యలు తప్పవని ఓ ప్రకటనలో తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 40 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జలవిద్యుదుత్పత్తి ద్వారా 39వేల క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయంలో నీటినిల్వ 9.296 టీఎంసీల మేర ఉంది. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 18వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 45 వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా వచ్చిన వరద నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయం పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అర్ధరాత్రి నుంచి దిగువకు నీటి విడుదల పెంచే అవకాశం ఉందని జూరాల అధికారులు తెలిపారు.


సుంకేసుల డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

- తుంగభద్ర నదిలో బుధవారం 36,440 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 10.5 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.8 అడుగులుగా ఉంది.
- సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి 35,780 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో 8 గేట్ల ద్వారా 34,216 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.



ఆయకట్టు.. భూమికి పచ్చాని రంగేసినట్టు!

ఇప్పుడు పొట్ట దశలో ఉన్న వరి పొలాలు కనువిందు చేస్తున్నాయి. కోయిలకొండ మండలం దమాయపల్లి గ్రామంలో గణపతిరాయుని చెరువు ఆయకట్టు కింద రైతులు సాగుచేసిన వరి పొలాలివి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఆ చెరువు కింద సాగవుతున్న వరిపొలాలు ప్రస్తుతం కంకి దశలో ఉండి కనుచూపు మేర ఆకుపచ్చ, పసిడి రంగుల్లో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆ దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఎంఈవోలొచ్చారు.. నిధులే రాలే!



గద్వాల న్యూటౌన్, అయిజ, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు, పాఠశాలలపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం ప్రతి మండలానికో ఎంఈవోను నియమించింది. 25వ తేదీ నుంచి వీరంతా విధుల్లో చేరారు. కొత్త మండలాల్లో కొత్త విద్యాధికారులు కార్యాలయాలను ప్రారంభిస్తున్నారు. అయితే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం, మండల విద్యావనరుల కేంద్రాల (ఎమ్మార్సీ)కి నిర్వహణ నిధులు మంజూరు చేయలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా నిధులు లేకపోవడంతో ప్రతి రోజూ నివేదికల తయారీ, రిజిస్టర్ల నిర్వహణ, అంతర్జాల వినియోగానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంఆర్సీలతో పాటు, సీఆర్సీ(క్లస్టర్ పాఠశాల సముదాయం)లకు నిధులు అందాల్సి ఉంది.

రాజోలిలో అయిదేళ్ల కిందట ఎమ్మార్సీ భవనం నిర్మించగా ఉపయోగంలో లేదు. ఇటీవల నియమితులైన ఎంఈవో భగీరథరెడ్డి కార్యాలయం ప్రారంభించారు. అయితే.. అవసరమైన ఫర్నిచర్, జిరాక్సు తీయడానికి పేపర్లు, రిజిస్టర్ల నిర్వహణ, నెట్ కనెక్షన్ కోసం నిధులు లేక ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాలేదు.

జోగులాంబ జిల్లా ఎర్రవల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా ఏదుల తాజా కొత్త మండలాలకు ఎంఈవోలను నియమించినా నిర్వహణ కోసం ఒక్క రూపాయి లేదు. వీరి పర్యవేక్షణ ఎలా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

జిల్లాల వారీగా రావాల్సిన నిధులు (రూ.లక్షల్లో)

జిల్లా	ఎమ్మార్సీలు	నిధులు	సీఆర్పీలు	నిధులు
గద్వాల	13	9.62	29	9.57
మహబూబ్‌నగర్	16	11.84	53	17.49
నాగర్‌కర్నూల్	20	14.80	57	18.81
నారాయణపేట	13	9.62	33	10.89
వనపర్తి	15	11.10	35	11.55

ఎమ్మార్సీ పరిస్థితి ఇది : ఉమ్మడి జిల్లాలో పాత మండలాల ప్రకారం.. 55, కొత్త మండలాల్లో మరో 21 ఎమ్మార్సీలున్నాయి. ప్రస్తుతం ప్రతి మండలానికి ఒక ఎంఈవోను నియమించడంతో నిర్వహణ నిధుల అవసరం నెలకొంది. సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉంది. ఏటా ఒక్కో ఎమ్మార్సీకి రూ.74 వేల చొప్పున అయిదు జిల్లాల పరిధిలో ఎమ్మార్సీలకు రూ.57.72 లక్షలు అందాల్సి ఉంది. నిధులేక కార్యాలయాల్లో చిన్నపాటి మరమ్మతులు, విద్యుత్తు బిల్లులు, సమావేశాల నిర్వహణ ఖర్చు, అంతర్జాల వినియోగం, స్టేషనరీ, పత్రికల ఖర్చు కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సీఆర్సీలకు: పాఠశాల సముదాయ కేంద్రాల పర్యవేక్షణ సీనియర్ గెజిటెడ్ హెచ్ఎం లేదా ఎంఈఓలకే ప్రత్యేకమైన అధికారాలు అందించింది. ఇప్పటికే రెండు దఫాలుగా పాఠశాలల సముదాయ సమావేశాలు చేపట్టారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో రికార్డుల నిర్వహణ, సమావేశాల ఖర్చులకు జీహెచ్ఎంలు ఇబ్బందిపడుతున్నారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉందనే వాదన వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 207 సీఆర్పీలుండగా, ఏటా ఒక్కో దానికి రూ.28 వేల చొప్పున రూ.57.96 లక్షల నిధులు మంజూరు కావాల్సి ఉంది.

త్వరలో వచ్చే అవకాశం: ఎంఈవోల నియామకంతో పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. పాఠశాలలకు 50 శాతం నిధులొచ్చాయి. ఎమ్మార్సీ, సీఆర్సీలకు త్వరలో వచ్చే అవకాశం ఉంది. నిధులు రాగానే వారి ఖాతాల్లో నేరుగా జమవుతాయి.

- రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

సీపీవో లేకుంటే కులగణన ఎలా?

న్యూస్‌టుడే– నారాయణపేట న్యూటౌన్

ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో) పోస్టు ఖాళీ నేపథ్యంలో సమగ్ర కుల గణన సజావుగా సాగేనా అన్న మీమాంశ జిల్లా వాసుల్లో నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుల గణన నిర్వహణకు పచ్చజండా ఊపింది. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించడానికి కుల గణనను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- ప్రతి పదేళ్లకోసారి జనాభా లెక్కిస్తారు. ఇతర సందర్భాల్లోనూ అవసరమైన గణాంకాలను ప్రభుత్వం తీసుకుంటున్నా కుల గణన మాత్రం చేపట్టలేదు. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలను గుర్తించారు. బీసీ జనాభాను మాత్రం వెల్లడించలేదు. ఆ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు.
- జిల్లాలో ప్రస్తుతం 6,71,766 జనాభా ఉంది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఓసీ జనాభా తగ్గి బీసీల జనాభా పెరిగినట్లు అంచనాలు ఉన్నాయి. కులగణన చేపడితే త్వరలో నిర్వహించే సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పనకు ప్రామాణికం అవుతుంది.
- ముఖ్య ప్రణాళికాధికారుల సారథ్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఇంటింటి సర్వే నిర్వహణకు ఎన్యూమరేటర్ల అవసరం ఉంటుంది. ఏయే శాఖలో ఎంతెంత మంది సిబ్బంది ఉన్నారో వంటి వివరాలు సేకరించాల్సిన అవసరం ఉంది. పేట సీపీవో ఇటీవల బదిలీపై జనగామ వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించలేదు. మహబూబ్‌నగర్ సీపీవో రవీందర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అక్కడి ఒత్తిడే ఉంటుంది. ఇక్కడ కార్యకలాపాలు చూడటం సాధ్యం కాదు. ఇవన్నీ గమనంలోకి తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఇదో భూ దందా!

- జీపీ లేఅవుట్ ప్లాట్లకు మళ్లీ రిజిస్ట్రేషన్
- మిడ్జిల్ రెవెన్యూ కార్యాలయంలో లీలలు
- గోప్యంగా ఉంచుతున్న అధికార యంత్రాంగం

ఈనాడు, మహబూబ్‌నగర్
న్యూస్‌టుడే, మిడ్జిల్

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో భూముల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. మండలంలోని కొన్ని సర్వే నంబర్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో ప్లాట్లుగా చేసి విక్రయించిన భూమిని లేఅవుట్ నిర్వాహకులు మళ్లీ వ్యవసాయ భూమిగా ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. మిడ్జిల్‌లో పలువురు పట్టాదారుల వద్ద 2007లో కొందరు పలు సర్వే నంబర్లలో సుమారు 31 ఎకరాలు కొనుగోలు చేశారు. వీటిలో జీపీ లేఅవుట్ చేసి సుమారు 600 ప్లాట్లను ఏర్పాటు చేశారు. 100-300 గజాల వరకు ప్లాట్లుగా మార్చి విక్రయించారు. 2007లో స్థానిక గ్రామపంచాయతీ నుంచి లేఅవుట్‌కు అనుమతులొచ్చాయి. ఈ ప్లాట్లకు కల్వకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేశారు. గత ప్రభుత్వం ధరణి వ్యవస్థను తీసుకురాగా వ్యవసాయ భూములను తహసీల్దార్లు, వ్యవసాయేతర భూములను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ సర్వే నంబర్లలోని ప్లాట్లను వ్యవసాయ భూములుగా చూపించి ఇటీవల వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారం వెనక పెద్ద తతంగమే నడిచినట్లు సమాచారం.


మిడ్జిల్ తహసీల్దారు కార్యాలయం

నిఘా

గతంలోనూ..

మిడ్జిల్ మండలం మసిగండ్ల శివారులో గతంలోనూ ఓ సర్వే నంబరులో చనిపోయిన మహిళ పేరు మీద ఉన్న మూడెకరాల భూమిని అదే పేరు మీద ఉన్న మరో మహిళను తీసుకొచ్చి రెవెన్యూ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో అప్పట్లో రూ.30 లక్షలు చేతులు మారాయని ఏకంగా ఆ మహిళ భర్తే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం వివాదం కావడంతో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే మండలంలోని కొత్తపల్లిలో విదేశాలకు వెళ్లి వచ్చిన ఓ వ్యక్తి భూమిని అదే పేరు మీద ఉన్న మరో వ్యక్తి స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించారు. విషయం తెలిసి పట్టాదారు వారిని పట్టుకుని ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మహబూబ్‌నగర్‌కు చెందిన ఆరుగురు, మిడ్జిల్‌కు చెందిన ఇద్దరు, కలెక్టరేట్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో కలిపి మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. మిడ్జిల్ రెవెన్యూ కార్యాలయంలో గతంలో అనేక అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినా వాటి నుంచి అధికారులు పాఠాలు నేర్చుకోవడంలేదు. తాజాగా జీపీ లేవుట్‌లోని ప్లాట్లను మళ్లీ వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్లు చేయడమే దీనికి నిదర్శనం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తే పెద్ద ఎత్తున అక్రమాలు బయటకొచ్చే అవకాశాలున్నాయి.

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో..


హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి వ్యవహారాలు తరచూ జరుగుతున్నాయి. జడ్చర్ల పరిధిలో కూడా లేఅవుట్లుగా మారిన ప్లాటను మళ్లీ రిజిస్ట్రేషన్ చేయడంతో అప్పట్లో బాధితులు కొందరు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేశారు. భూత్పూరు పరిధిలోని అమిస్తాపూర్‌లోనూ జీపీ లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించారు. తర్వాత పట్టాదారు ఆ స్థలాన్ని ఇతరులకు విక్రయానికి పెట్టడంతో వారంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా రెవెన్యూ శాఖ ఈ భూములను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో పూర్వాపరాలను పరిశీలించకపోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి.

జీపీ లేఅవుట్‌గా మార్చి ప్లాట్లుగా విక్రయించిన భూమిని వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేయకూడదు. తహసీల్దారు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేయాలి. మిడ్జిల్ వ్యవహారంపై విచారణ జరిపిస్తాం. రిజిస్ట్రేషన్లలో అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌రావు, అదనపు కలెక్టర్(రెవెన్యూ), మహబూబ్‌నగర్

విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29 వరకు గడువు ఉందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, సైన్స్ తదితర కోర్సులు 60 శాతం మార్కులతో పూర్తిచేయాలన్నారు. ఈ -పాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుని కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలు మించరాదని, 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. జీఆర్ఈ, జీఎంఏటీ, టోఫెల్, ఐఈఎల్‌టీఎస్‌లో 60 శాతం మార్కులు కలిగినవారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



ఊయల్లు కాదు.. యమపాశాలు!

ఊయలను తలపిస్తున్న విద్యుత్తు తీగలు కోయిలకొండ మండలం జయనగర్‌తండాలో కనిపించాయి. ఇలా వేలాడుతున్న విద్యుత్తు తీగలు తగిలి మూగజీవాలు మృత్యువాత పడుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి తీగలతో ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు విద్యుత్తు అధికారులకు సమాచారం అందించినా స్పందన కొరవడుతోంది. గత్యంతరం లేక ప్రమాదాల నుంచి తప్పించుకోడానికి ఇలా కర్రలను ఏర్పాటుచేసుకుంటున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

నవరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.37 లక్షలు

అలంపూర్, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అలంపూర్ ఆలయాలకు రూ. 37 లక్షల ఆదాయం సమకూరిందని ఈవో పురేందర్ తెలిపారు. పది రోజుల పాటు బాల బ్రహ్మేశ్వర స్వామి, జోగులాంబ ఆలయాల్లో ఎంతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పది రోజుల్లో ఆలయాల్లో భక్తుల నుంచి ప్రసాదం ద్వారా, స్వామి, అమ్మ వారి సన్నిధిలో శీఘ్రదర్శనం, అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబ సన్నిధిలో త్రిశతి, ఖడ్గమాల, చండీహోమం, సహస్రనామార్చన, కొలువు పూజ, విరాళాల ద్వారా ఈ ఆదాయం సమకూరిందని ఆయన వివరించారు.

భారత నెట్‌బాల్ మహిళా జట్టు కోచ్‌గా పాలమూరువాసి




విక్రమాదిత్య రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ నెట్‌బాల్ ఛాంపియన్ షిప్ టోర్నీలో పాల్గొనే భారత మహిళా జట్టుకు కోచ్‌గా మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన నెట్‌బాల్ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు నెట్‌బాల్ భారత సమాఖ్య ఛైర్మన్ హరిఓం కౌశిక్, జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు సుమన్ కౌశిక్, విజయేందర్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విక్రమాదిత్యరెడ్డిని రాష్ట్ర కార్యదర్శి ఖ్వాజా ఖాన్, సంఘం సభ్యులు అభినందించారు.

ఇథనాల్ కర్మాగారం ఏర్పాటుచేయొద్దు

పనులను అడ్డుకున్న గ్రామస్థులు



కంపెనీ యాజమాన్యం ఎదుట నిరసన

శాంతినగర్, న్యూస్‌టుడే: రాజోలి మండలం పెద్దధన్వాడ శివారులో గాయత్రీ ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయొద్దంటూ పరిసర గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. పనులు మొదలవుతున్నాయని తెలుసుకున్న చిన్నధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాటు, నౌరోజీక్యాంపులకు చెందిన రైతులు, ప్రజలు బుధవారం ఆ ప్రదేశానికి చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. కర్మాగారం ఏర్పాటు వల్ల భవిష్యత్తులో మేము, మా పిల్లలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయవద్దంటూ అడ్డుకున్నారు. ఎలాంటి ఇబ్బందీ ఉండదని నచ్చ చెప్పేందుకు ప్రయత్నించినా ప్రజలు ససేమిరా అన్నారు. చుట్టుపక్కల వాగులు, కాలువలు, పంటపొలాలు అన్నీ దెబ్బతింటాయన్నారు. ప్రస్తుతం జింకలపల్లె, కలుకుంట్ల ప్లాంట్ల వల్ల వాటి చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రైతులు అలెగ్జాండర్, నాగరాజు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్లాంట్ వద్దని నిరసన తెలిపారు. శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి దీనివల్ల ఎటువంటి నష్టం లేదని నిరూపించాలని డిమాండ్‌చేశారు. దీనికి కంపెనీ యాజమాన్యం 15 రోజులు సమయం కోరడంతో రైతులు, ప్రజలు అక్కడ నుంచి బయటకు వచ్చారు. ప్లాంట్ పనులు మొదలు పెడితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జయరామిరెడ్డి, రెహమాన్, పరమేశ్, లోకేశ్వర్‌రెడ్డి, రవి, భద్రయ్య, శ్రీను, పాల్గొన్నారు.

విభిన్న విజేతలు



కల నెరవేరిన వేళ



ప్రశాంతి

● ప్రశాంతి ● రాజోలి మండలం పెద్ద దన్వాడ ● పెద్ద దన్వాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్జీటీ ● ఏడో తరగతి వరకు పెద్ద దన్వాడ పాఠశాలలోనే చదివారు. 2022 వరకు నాలుగేళ్ల విద్యా వాలంటీర్‌గా కూడా పనిచేశారు. తాను చదివిన పాఠశాలకే ఉపాధ్యాయురాలిగా వెళ్లాలన్నది తన చిన్ననాటి కలని, అది నెరవేరటం చాలా ఆనందంగా ఉందని ప్రశాంతి పేర్కొన్నారు. **- రాజోలి**

చిన్ననాటి జ్ఞాపకాలతో



రాముడు, తుమ్మిళ్ల

● రాముడు ● రాజోలి మండలం తుమ్మిళ్ల ● రాజోలి ఉన్నత పాఠశాలలో . జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్ ● రాముడు రాజోలిలోని వసతిగృహంలో ఉంటూ స్థానిక ఉన్నత పాఠశాలలో చదివారు. ఇప్పుడు అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు. చిన్ననాటి జ్ఞాపకాలెన్నో పెనవేసుకుని ఉన్న పాఠశాలలో పనిచేయటం గొప్ప అనుభూతని, విద్యార్థులను బాగా తీర్చిదిద్దుతానని రాముడు పేర్కొన్నారు. **- గద్వాల, న్యూటౌన్**

అంధకారాన్ని జయించి..



విష్ణు

● ఎం. విష్ణు ● కొత్తకోట మండలం ముమ్మాళ్లపల్లి ● ఆత్మకూరు మండలం రేచింతల గ్రామ పాఠశాల ● పుట్టుకతో అంధుడైన విష్ణు మహబూబ్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ పూర్తిచేశారు. తర్వాత ఎంఏ, డీఎడ్, బీఎడ్ చేశారు. సోదరుల సహకారంతో డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్‌గా కొలువు సాధించారు. **- ఆత్మకూరు**

లాఠీ వదిలి.. సుద్దముక్క చేపట్టి



నౌషీన్

● నౌషీన్ ● మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ● చిన్నచింతకుంట మండలం పర్దిపూర్ ప్రాథమిక పాఠశాల ● ప్రస్తుతం మరికల్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. టీటీసీ పూర్తి చేసిన ఆమె ఉపాధ్యాయురాలు కావాలన్న కల నెరవేరేదాకా కానిస్టేబుల్‌గా కొనసాగాలని ఆ ఉద్యోగంలో చేరారు. ఇటీవల ఎస్జీటీగా ఎంపికయ్యారు. **- నారాయణపేట న్యూటౌన్**

కానిస్టేబుల్, కోర్టు కొలువులు వద్దనుకుని...



మాలతీ యాదవ్

● మాలతీయాదవ్. ● కోస్గి పురపాలిక ● దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల ● మొదట కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయితే కాదనుకున్నారు. ఆ తర్వాత కోర్టులో 13 నెలల పాటు ఎగ్జామినర్‌గా పనిచేశారు. తాజా డీఎస్సీలో ఎస్జీటీ ఎంపికయ్యారు. **- కోస్గి**

ఆరు కొలువులకు అర్హత



జుట్ల కవిత

పేరు: కవిత **చిరునామా:** మక్తల్ పట్టణం అంబేద్కర్‌నగర్ **పోస్టింగ్ :** నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల **ప్రత్యేకత :** కవిత 2019లో పంచాయతీ కార్యదర్శిగా, 2023లో కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా, 2024 గురుకుల పరీక్షల్లో తెలుగు, సోషల్ ఉపాధ్యాయురాలిగా, తాజా డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. చదువుతోనే పేదరికాన్ని జయించవచ్చని నమ్మి కష్టపడ్డానని కవిత తెలిపారు. **- మక్తల్ పట్టణం**

రెండు ఉద్యోగాలు వదులుకుని..



ఓంకార్

● ఓంకార్ ● పెబ్బేరు మండలం రామాపురం ● తిప్పాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ● చిన్నప్పటి నుంచి టీచర్ ఉద్యోగమే అతని లక్ష్యం. 2018లో కానిస్టేబుల్‌గా, 2019లో రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగం సాధించినా సంతృప్తినివ్వలేదు. సోదరుల ప్రోత్సాహంతో చదివి ఎట్టకేలకు తన లక్ష్యాన్ని చేరుకున్నారు **- పెబ్బేరు పట్టణం**

తన ఊరి బడిలోనే..



నాగరాజు

● నాగరాజు ● ఆత్మకూరు మండలం మేడేపల్లి ● ఆత్మకూరు మండలం మేడేపల్లి పాఠశాల ● సొంతూరిలో ప్రాథమిక విద్య చదివిన పాఠశాలలోనే ఎస్జీటీగా పోస్టింగ్ పొంది పని చేయటం గొప్ప అనుభూతిని ఇస్తుందని నాగరాజు పేర్కొన్నారు. **- ఆత్మకూరు**

ఒకేసారి అన్న, ఇద్దరు చెల్లెళ్లు



సమ్రీన్ ఫాతిమా, రహేమత్, సనా జబీన్

● మహమ్మద్ రహమత్, సమ్రీన్ ఫాతిమా, సనా జబీన్ ● మహబూబ్‌నగర్ హనుమాన్‌పుర ● రహమత్ (మహబూబ్‌నగర్‌లోని గోల్ మజీద్), సమ్రీన్ ఫాతిమా (మహబూబ్‌నగర్ మార్కెట్ రోడ్డు), సనా జబీన్ (వీరన్నపేట) ● అన్న, ఇద్దరు చెల్లెళ్లు ఒకేసారి ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. రహమత్‌కు పీఈటీ విభాగంలో, ఎస్ఏ గణితంలో సమ్రీన్ ఫాతిమాకు మొదటి ర్యాంకు, సనా జబీన్‌కు ఎస్జీటీ విభాగంలో 5వ ర్యాంకు వచ్చాయి. కుటుంబ సభ్యుల సహకారం, ఉపాధ్యాయులైన అక్కాబావల స్ఫూర్తితో ఉద్యోగాలను సాధించినట్లు రహమత్ చెప్పారు. **- పాలమూరు**

క్రీడా కోటాలో



విద్యార్థులతో మేకల మంజుల

● మేకల మంజుల ● భూత్పూర్ మండలం మద్దిగట్ల ● మిడ్జిల్ మండలం కాటోనిగడ్డతండా పాఠశాల ● మంజుల కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో క్రీడాపోటీల్లో పాల్గొంటూనే ఎంఏ(తెలుగు), డీఎడ్ పూర్తిచేశారు. 2022లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. వరంగల్‌లో శిక్షణలో ఉండగా ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. క్రీడా కోటాలో ఉపాధ్యాయురాలిగా అవకాశం దక్కింది. ఉపాధ్యాయురాలు కావాలనే లక్ష్యంతో పోలీస్ కొలువుని వదులుకున్నానని ఆమె చెబుతున్నారు. **- భూత్పూర్**

గురువు వద్దకే గురువుగా..



తన గురువు శ్రీశైలం వద్ద విధుల్లో చేరుతున్న నెల్లికంటి హరీశ్

● నెల్లికంటి హరీశ్ ● పదర మండల కేంద్రం ● పదర మండలం వంకేశ్వరం ప్రాథమిక పాఠశాల ● హరీశ్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3, 4 తరగతులు చదివేటప్పుడు శ్రీశైలం ఉపాధ్యాయుడిగా బోధించారు. ఇప్పుడు శ్రీశైలం ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వంకేశ్వరం ప్రాథమిక పాఠశాలలోనే హరీశ్ ఎస్జీటీగా నియమితులయ్యారు. తన గురువు వద్దకే ఉపాధ్యాయుడిగా వెళ్లి పని చేయటం ఆనందంగా ఉందని హరీశ్ తెలిపారు. **- అచ్చంపేట**

సొంతూరిలోనే కొలువు



కౌకుంట్ల భగవంతు

● కౌకుంట్ల భగవంతు ● లింగాల మండలం అప్పాయిపల్లి ● అప్పాయిపల్లి పాఠశాలలో ఎస్జీటీ ● బీఎస్సీ, డీఎడ్ పూర్తి చేసిన భగవంతు బల్మూరు మండల వనరుల కేంద్రంలో ఎంఐఎస్ సమన్వయ కర్తగా గతేడాది జులై నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికై కౌన్సెలింగ్‌లో సొంతూరికే పోస్టింగ్ పొందారు. తాను చదివిన పాఠశాలలోనే పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని భగవంతు ఆనందంగా చెప్పారు. **- అచ్చంపేట**

రైల్వే ఉద్యోగం నుంచి..



ఆంజనేయులు

● ఆంజనేయులు ● అడ్డాకుల మండల కేంద్రం ● అడ్డాకుల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ● ఎనిమిదేళ్ల నుంచి కర్నూలులో రైల్వే ఉద్యోగం చేస్తున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా సొంతూరిలోని పాఠశాలలో పోస్టింగ్ పొందారు. రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి ఉపాధ్యాయుడిగా చేరారు. సొంతూరిలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టడం మరిచిపోలేని అనుభూతని ఆంజనేయులు పేర్కొన్నారు. **- అడ్డాకుల**

చదివిన చోటే కొలువు



జోగోళ్ల అంజిలప్ప

● జోగోళ్ల అంజిలప్ప ● దామరగిద్ద మండలం మొగల్‌మడ్క ● మొగల్‌మడ్క జిల్లా పరిషత్తు పాఠశాల ● ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న మొగల్‌మడ్క జిల్లా పరిషత్తు పాఠశాలలోనే ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. కౌన్సెలింగ్‌లో తాను చదివిన పాఠశాలకే పోస్టింగ్ రావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. **- నారాయణపేట పట్టణం**

ఒకేసారి అక్కాచెల్లెళ్లు



కృష్ణవేణి అనురాధ

● కృష్ణవేణి, అనురాధ ● మూసాపేట మండలంలోని తిమ్మాపూర్ ● కృష్ణవేణి(అడ్డాకుల మండలం కాటవరం), అనురాధ(అడ్డాకుల మండలం పెద్దమునుగల్‌చేడు) ● అక్కాచెల్లెళ్లు ఇద్దరు ఒకేసారి ఎస్జీటీలుగా కొలువులు సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే విజయం సాధించగలిగామని ఈ అక్కాచెల్లెళ్లు తెలిపారు. **- భూత్పూరు**

19న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా విలువిద్య ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల,బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 19న మహబూబ్‌నగర్‌లోని డీఎస్‌ఏ మైదానంలో ఉదయం 9 గంటలకు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్, ఆధార్ జిరాక్సు ప్రతులతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90108 04720 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

వేములలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్లు

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-17 వాలీబాల్ బాల,బాలికల జట్లను ఈ నెల 19న అడ్డాకుల మండలం వేముల జడ్పీ హెచ్‌ఎస్ మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. వివరాలకు 89191 93768లో సంప్రదించాలని సూచించారు.

పోలీసులు పట్టించుకోలేదని ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖదీర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : భార్య, కుటుంబసభ్యుల వేధింపులు భరించలేక ఓ వ్యక్తి బుధవారం వనపర్తి ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వనపర్తి పట్టణం రాంనగర్‌కాలనీకి చెందిన ఖదీర్ కుటుంబసభ్యులతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య, ఆమె కుటుంబసభ్యులు వేధిస్తున్నారని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం వనపర్తి ఎస్పీ కార్యాలయానికి దోమలను అరికట్టే ద్రావణంతో వచ్చారు. ఎస్పీని కలవాలని పోలీసు సిబ్బందితో చెప్పారు. వారు 'ఎస్పీ లేరు.. ఏఎస్పీ ఉన్నారు. ఆయనతో మాట్లాడిస్తాం కూర్చొమని' చెప్పారు. మనస్తాపం చెందిన ఆయన వెంట తెచ్చుకున్న దోమల నివారణ ద్రావణాన్నితాగారు. అక్కడున్న పోలీసు సిబ్బంది అడ్డుకునే యత్నం చేశారు. ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఏఎస్పీ రామదాస్‌తేజను వివరణ కోరగా.. బాధితుడు తమకెలాంటి ఫిర్యాదు చేయలేదని, అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి పంపించామని పేర్కొన్నారు.

నవజాత శిశువు మృతి

బంధువుల ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న శిశువు బంధువులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : నవజాత శిశువు మృతి చెందిన సంఘటన జడ్చర్లలోని ప్రాంతీయ ఆసుపత్రిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా... పురపాలిక పరిధిలోని నాగసాల గ్రామానికి చెందిన చెన్నకేశవులు, భార్య కీర్తి మొదటి కాన్పు కోసం ప్రాంతీయ ఆస్పత్రికి బుధవారం వచ్చారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్‌నర్సు సాధారణ కాన్పు చేశారు. కాన్పులోనే మగశిశువు మరణించాడు. కాన్పు సమయంలో వైద్యుడు లేకపోవడం వల్లే శిశువు మృతి చెందినట్లు బంధువులు ఆందోళనకు దిగారు. డ్యూటీ డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ... తాను పక్కనే మరో కాన్పు చేస్తున్నానని, ఆ సమయంలో శిశువు ఉమ్మ నీరు మింగడంతో కాన్పు జరగకముందే మృతి చెందినట్లు చెప్పారు.

కారు అదుపు తప్పి యువకుడి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జయిన కారు



పటేల్ రామచంద్రారెడ్డి(పాతచిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడని గద్వాల గ్రామీణ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గద్వాల పుర పరిధిలోని కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉంటున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి కొడుకు పటేల్ రామచంద్రారెడ్డి(28) బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఎర్రవల్లి నుంచి గద్వాలకు కారులో వస్తున్నాడు. గద్వాల మండలం అనంతపురం శివారులో వాహనం అదుపు తప్పి రహదారి పక్కనున్న కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న గద్వాల గ్రామీణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధరించారు. తండ్రి పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ చెప్పారు.

మిన్నంటిన రోదనలు

రామచంద్రారెడ్డి దుర్మరణం చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. వారి రోదనలతో ఆస్పత్రి ప్రాంగణంలో విషాద వాతావరణం నెలకొంది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు పార్టీ నేతలు, ఇతర రాజకీయ నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

18, 19 తేదీల్లో పీయూలో సౌత్‌జోన్ జట్ల ఎంపికలు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం(పీయూ)లో అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు సంబంధించిన సౌత్ జోన్ ఎంపికలు ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పీడీ డా.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న పురుషుల విభాగంలో బాడ్మింటన్, 19న త్రైక్వాండో పురుషులు, మహిళలు, కబడ్డీ స్త్రీ, పురుషుల ఎంపికలు ఉంటాయన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 17-25 ఏళ్ల వయస్సు మధ్యలో ఉండాలన్నారు. ప్రస్తుతం వారు చదువుతున్న కళాశాల బోనఫైడ్‌తో పాటు 10వ తరగతి మెమోతో హాజరు కావాలన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని, ఆసక్తి కలిగిన వాళ్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ క్షేత్రంలో వృద్ధ దంపతుల దారుణ హత్య



ఉషయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి



ఉషయ్య శాంతమ్మ

కందుకూరు, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం వచ్చి.. వ్యవసాయ క్షేత్రంలో కాపలాదారులుగా పని చేస్తూ అక్కడే ఆవాసం ఉంటున్న వృద్ధ దంపతులను దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు ఠాణా పరిధిలోని కొత్తగూడలో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా బుధవారం వెలుగుజూసింది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన మూగ (చింతబాయి) ఉషయ్య (70), అతడి భార్య శాంతమ్మ(60) కొత్తగూడ సమీపంలో వారి స్వగ్రామానికి చెందిన యజమాని మనోహర్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో రెండున్నరేళ్లుగా కాపలాదారులుగా పనిచేస్తున్నారు. మామిడి తోటలో ఓ పక్కన షెడ్డుతోపాటు నిర్మించిన గదుల్లో నివాసం ఉంటున్నారు. వీరిని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. శాంతమ్మను ఇంట్లోనే మంచంపై గొంతు కోసి హత్య చేశారు. ఉషయ్యను వారు నివాసం ఉంటున్న వంద మీటర్ల దూరంలో మామిడి తోటలో పరుగెత్తించి మెడభాగంపై నరికి చంపారు.

మర్నాడు వెలుగుజూసింది ఇలా..

దంపతులతో మాట్లాడానికి బుధవారం ఉదయం మనోహర్‌రావు పలుమార్లు ఫోన్ చేశారు. ఫోన్లు ఎత్తకపోవడంతో కందుకూరుకు చెందిన కొమ్మగళ్ల మహేందర్‌కు ఫోన్‌చేసి ఉషయ్య వద్దకు వెళ్లి మాట్లాడించాలని సూచించారు. మహేందర్ అక్కడికి వెళ్లగా మంచంపై రక్తపు మడుగులో శాంతమ్మ మృతదేహం కనిపించింది. భయాందోళనకు గురైన అతడు దూరం పరుగెత్తి వెంటనే యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన దాసర్లపల్లికి చెందిన తాండ్ర మహేందర్‌కు సమాచారం చేరవేసి వెళ్లిచూడాలని చెప్పాడు. అతడికి ధైర్యం చాలక సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్న రైతులు బుచ్చిరెడ్డి, కృష్ణయ్యలతో కలిసి వెళ్తుండగా ఉషయ్య మృతదేహం కనిపించింది. ఇద్దరూ హత్యకు గురైనట్లు ఫోన్‌చేసి చెప్పటంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసును ఛేదించే క్రమంలో పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి ఆధారాలను సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మనోహర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● బాగా తెలిసిన వారే ఇద్దర్ని హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శరీరంపై ఉన్న వెండి ఆభరణాలు తీసుకెళ్లకపోవడంతో దొంగలు కాకపోవచ్చని భావిస్తున్నారు. శాంతమ్మ హత్య జరిగిన సమీపంలో భోజనం చేసిన ప్లేటులో సగం కలిపిన అన్నం ఉండటంతో రాత్రి నిద్రించక ముందే హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

చికెన్ ధరలు

ఫారంరేటు	126–00
రిటైల్	148–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

తెరపై ఈనాడు

దేవర: మనోహర్(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంబ(కోస్గి), శ్వాగ్: మహేశ్వరి(నారాయణపేట) - న్యూస్‌టుడే, నారాయణపేట పాతబస్టాండ్

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.80, గోకరకాయ రూ.70, క్యాప్సికం 80, బీన్స్ 120, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60, క్యాబేజీ రూ.50, ఉల్లి రూ.50, చింతపండు రూ.110. - న్యూస్‌టుడే, పాతబస్టాండ్(నారాయణపేట)

పశువులకు టీకా.. రైతుకు భరోసా

జిల్లాలో ముమ్మరంగా గాలికుంటు నివారణ వ్యాక్సిన్లు

న్యూస్‌టుడే– పాతబస్టాండ్(నారాయణపేట)



ఇబ్రహీంపట్నంలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

పశువుల్లో గాలి కుంటు వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎక్కువగా తెల్ల ఆవు జాతి(ఆవులు, ఎద్దులు)కి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు గుర్తించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. టీకాలు వేసిన ప్రతి పశువుకు చెవికి పోగులా ట్యాగ్ వేస్తారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. 25 బృందాలను ఏర్పాటు చేసి 9.5లక్షల పశువులకు టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశారు. 37 పశు వైద్యశాలలు, 20 ప్రాథమిక కేంద్రాలు, గామీణ పశువైద్యశాలలతో పాటు ప్రధాన గ్రామాల్లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం మొదలుపెట్టారు.

టీకాతో ఎన్నో ఉపయోగాలు..

గాలికుంట వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, కాలిగిట్టల మధ్య పగుళ్లు, నోటిలో పుండ్లు పడటం, బాగా నీరసించిపోవడం, పాల దిగుబడి తగ్గిపోవడం, పని సామర్థ్యం తగ్గిపోవడం జరుగుతుంది. వ్యాధి సోకిన పశువుల్లో ఐదు శాతం చనిపోతుండటంతో ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు. అందుకే ఏటా రెండు సార్లు ఉచితంగా టీకాలు అందిస్తున్నారు. 'బయట ఈ టీకాలు వేయించాలంటే ఎక్కువగా డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పశువులు ఉన్న రైతు దగ్గరకే ఈ అవకాశం వస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఈశ్వర్‌రెడ్డి అన్నారు.

జిల్లాలో వివరాలు..	
మొత్తం పశువులు	95575
టీకాల లక్ష్యం	80వేలు
ఇప్పటి వరకు వ్యాక్సిన్ వేసింది	4779

నేడు అంబా భవానీ ఆలయంలో మేల్కొలుపు

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలకేంద్రంలోని అంబా భవాని ఆలయంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని, అమ్మవారికి మేల్కొలుపు పూజలు నిర్వహిస్తామని సమాజ్ అధ్యక్షుడు సి.అశోక్ తెలిపారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అన్నదానం జరుగుతుందన్నారు.

మెరుగుపడనున్న రవాణా సౌకర్యం



హన్మన్‌పల్లి బీటీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు వార్ల విజయకుమార్

కోస్గి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పెద్దమొత్తంలో నిధులను అందించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వార్ల విజయకుమార్ అన్నారు. బుధవారం హన్మాన్‌పల్లి నుంచి చింతగట్టు తండా వరకు రూ.1.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రవాణా సౌకర్యం ఉన్నప్పుడే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విక్రం రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రాఘవ రెడ్డి, గాల్‌రెడ్డి, రాజు నాయక్ పాల్గొన్నారు.



రాజు చిత్రపటానికి నివాళులు అర్పించిన అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు, వివిధ పార్టీల నాయకులు

ఆయన సేవలు మరువలేనివి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : వ్యాపారవేత్త సరాఫ్ రాజు సేవలు మరవలేనివని అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు కాకర్ల భీమయ్య అన్నారు. బుధవారం సత్యనారాయణ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కొనంగేరి హన్మంతు, నాయకులు సరాఫ్ నాగరాజు, అప్పి, జంగిటి వెంకటేశ్, అంజి పాల్గొన్నారు.

మక్తల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని సహకార సొసైటీ ఆవరణలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బుధవారం ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు సన్న రకానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు సరిపడా గన్నీ బస్తాలు ఇవ్వాలన్నారు. నిర్ణీత సమయంలో అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. పీఏసీఎస్ మేనేజరు రాములు, గణేశ్, ఆనంద్‌గౌడ్, కట్ట సురేశ్, గాయత్రి అనిల్, రవికుమార్, అంపణ్ణ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు, న్యూస్‌టుడే : మాగనూరు సొసైటీ ఆధ్వర్యంలో కృష్ణా మండలం హిందుపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా సకాలంలో డబ్బులు అందేలా చూడాలని ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా కేంద్రాల్లో విక్రయించాలన్నారు. తహసీల్దారు దయాకర్‌రెడ్డి, ఎంపీడీవో జానయ్య, ఏఎంసీ బస్వరాజ్ రెండు మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పట్టణంలోని తన స్వగృహంలో బాధితులకు పంపిణీ చేశారు. పేద ప్రజలు ఆసుపత్రి పాలై ఆర్థిక ఇబ్బంది పడకుండా తమ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, గాయత్రి అనిల్, రాములు, బిల్డర్ తాయప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కడపరాయుడి చరిత్ర పాటల సీడీ విడుదల

ధన్వాడ: గున్ముక్ల గుట్టపై వెలసిన స్వయం భూ కడపరాయుడి జీవిత చరిత్ర, పాటలకు సంబంధించిన సీడీని గురువారం విడుదల చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రఘోత్తమరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డిలు తెలిపారు. సొంత నిధులతో వీటిని రూపొందించినట్లు వెల్లడించారు. నారాయణపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి శివకుమార్‌రెడ్డి చేతుల మీదుగా 10 పాటల సీడీని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వామి వారి పల్లకీ సేవ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,310

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలను బుధవారం నిర్వహించారు. రైతులు 168 క్వింటాళ్ల (336 బస్తాలు) ధాన్యం తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,310, మాదిరి ధర రూ.2,000, కనిష్ఠ ధర రూ.1,629 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో వెలసిన ఎల్లమ్మ దేవత ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 11రోజులపాటు మల్లప్పస్వామి



మక్తల్ ఎల్‌బీనగర్ ఎల్లమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న స్వాములు

నిరాహారంగా ఉంటూ రోజువారీ కార్యక్రమాలు కొనసాగించారు. చివరిరోజు ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హన్మంతు, వెంకటప్ప, మల్లప్ప, సవరప్ప పాల్గొన్నారు.

మర్యాద పాటించాల్సిందే

నర్వ, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో ప్రభుత్వ నిధులతో నిర్మించే ప్రతి భవనంపై ప్రోటోకాల్ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గత శాసనసభ్యుడి నిధులతో నిర్మిస్తున్న వాల్మీకి భవన ప్రారంభోత్సవ శిలాఫలకంపై ప్రోటోకాల్‌కు అనుగుణంగా పేర్లు ఉండాలన్నారు. రాంరెడ్డి, అజిత్‌రెడ్డి, విజయరాం, హన్మంతు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు ఐటీఐ ఫీజు చెల్లింపు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ఐటీఐలో చేరితే ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తుందని జిల్లా కార్మికశాఖ సహాయ అధికారి పి. మహేశ్ కుమార్ తెలిపారు. కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు కలిగివున్న భవన నిర్మాణ రంగ కార్మికుల పిల్లలు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, ఐటీఐలో ఆరు కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19 వరకు గడువు ఉందన్నారు. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందన్నారు.

చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీఓ తిరుపతయ్య

కోస్గి (గ్రామీణం, న్యూస్‌టుడే : పిల్లలు లేని వాళ్లు చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవాలని డీసీపీఓ (బాల సంరక్షణ అధికారి) తిరుపతయ్య అన్నారు. బుధవారం కోస్గి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిరోధ చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకుంటే వచ్చే ప్రయోజనాలు వివరించారు. చట్టవిరుద్ధంగా దత్తత తీసుకుంటే మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని అన్నారు. 18 ఏళ్ల పిల్లలు ఇబ్బందికర పరిస్థితిలో ఉంటే బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మీపీఓ శ్రీధర్, సూపరింటెండెంట్ తిరుపతయ్య, బాలరక్ష అధికారి కవిష్టా తదితరులు పాల్గొన్నారు.

19న చిన్నారులకు హృద్రోగ వైద్య శిబిరం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: హృదయ క్యూర్ లిటిల్ హార్ట్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈనెల 19న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో 0-18 ఏళ్ల చిన్నారులకు హృద్రోగ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలున్న చిన్నారులకు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం



రాంకిష్టాయపల్లిలో వృథాగా పోతున్న నీరు

న్యూస్‌టుడే–ధన్వాడ

● నిబంధనల ప్రకారం తాగునీటి కుళాయిలకు ఎవరూ మోటార్లు బిగించకూడదు. ఎవరైనా అలా చేస్తే నీటి సరఫరా అస్తవ్యస్తం అవుతుంది. మరికల్ మండలం తీలేర్‌కు చెందిన లింగమ్మ కుళాయికి మోటార్ బిగిస్తుండగా దసరా రోజున విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకపోయినా మోటార్లను వినియోగిస్తున్నారు. ఈ సంఘటనలో స్థానిక పాలకులతో పాటు తాగునీటి శాఖాధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది.

● జిల్లాలోనూ పలు చోట్ల సోర్సుబోరు నీటితో పాటు భగీరథ నీటిని ఒకే పైపు లైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఫలితంగా అప్పుడప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై వినియోగదారులకు అవగాహన కల్పించాలి. కానీ పట్టించుకోవడంలేదు. భగీరథ పథకం ద్వారా ఏర్పాటు చేసిన పలు కుళాయిలకు నేటికీ నీళ్లు రావడంలేదు. 50 శాతం నీళ్లు కలుషితం కావడమో, రంగు మారి రావడమో జరుగుతోంది. జిల్లాలో రోజూ ఏదో ఒక చోట ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. ఇటీవల మక్తల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లోనూ, ధన్వాడ మండలం రాంకిష్టాయపల్లిలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

● రాంకిష్టాయపల్లి, కిష్టాపూర్, గోటూర్ తదితర గ్రామాల్లో వీధి కుళాయిలకు ఆన్‌ఆఫ్ బిరడాలు లేక నీరు వృథా అవుతోంది. ప్రతియేటా నీటి స్వచ్ఛత కొలిచేందుకు కిట్లను పంచాయతీలకు అందజేశారు. వీటితో పరీక్షిస్తున్న దాఖలాలు ఎక్కడా లేవు. అత్యధిక చోట్ల ట్యాంకులను సైతం శుభ్రపర్చడంలేదు. ఇకనైనా వీటన్నింటిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

భగీరథ నీటి సరఫరా ఇలా

మండలం	ట్యాంకులు	కుళాయిలు
ధన్వాడ	44	8,639
దామరగిద్ద	42	12,294
మరికల్	30	8,832
నారాయణపేట	56	14,561
కోస్గి	56	13,023
మద్దూరు	86	16,728
కృష్ణా	17	6,312
మక్తల్	44	17,007
నర్వ	21	7,046
ఊట్కూరు	37	11,191
మాగనూరు	20	5,903

స్ఫూర్తిదాయకం... ఉద్యోగ విజయం



వీరేశ్

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : కోస్గి మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. గుండుమాల్ మండలం బలభద్రాయపల్లిలో వీరేశ్ పనిచేస్తున్నారు. ఈయనది మద్దూరు మండలం పల్లెగడ్డతండా. 2019లో కార్యదర్శి ఉద్యోగం సాధించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం మక్తల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. ఈయన భార్య ప్రియాంక గురుకుల పాఠశాలో టీచర్‌గా, వదిన అరుణ గురుకుల కళాశాలలో అధ్యాపకురాలిగా రెండు నెలల క్రితమే ఉద్యోగాల్లో చేరారు.



హర్షతబుసుమ్

● కోస్గి మండలం ముశ్రీఫా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హర్షతబుసుమ్ చిన్న చింతకుంట మండలం బండర్‌పల్లి వాసి. 2019లో కార్యదర్శిగా విధుల్లో చేరారు. ఇటీవల డీఎస్సీలో ఎంపికై చిన్నచింతకుంట మండలం నెల్లికొండ ప్రాథమిక పాఠశాలలో చేరారు. తండ్రి మహ్మద్‌జానీ ప్రధానోపాధ్యాయుడిగా, చెల్లెలు తహసీన్ ఎస్‌జీటీగా, తమ్ముడు ఇంజినీరుగా పనిచేస్తున్నారు.

కానిస్టేబుల్ నుంచి ఉపాధ్యాయుడిగా



కమలాకర్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మక్తల్ మండలం అనుగొండ గ్రామానికి చెందిన గడ్డం కమలాకర్ మూడు ఉద్యోగాలు సాధించారు. బుధవారం ముస్లాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు స్వగ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. మక్తల్‌లోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. నారాయణపేటలో డీఎడ్ చేశారు. 2021లో రాష్ట్ర పోలీసు బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేపట్టారు. 2024లో సివిల్ కానిస్టేబుల్‌గా ఎన్నికై వరంగల్‌లో శిక్షణ పొందుతున్నారు. అక్కడ ఉంటూ డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఎస్జీటీగా ఉద్యోగం చేపట్టారు.

సార్వత్రిక డిగ్రీ ప్రవేశాల గడువు పెంపు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో డిగ్రీలో చేరడానికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం సమన్వయకర్త భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 15తో ముగిసిన గడువును పెంచినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు విధిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాల్సి ఉంటుందన్నారు.

మక్తల్‌లో వ్యాపారుల ఆందోళన



మక్తల్‌లో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రాజస్థాన్ వ్యాపారులకు వ్యతిరేకంగా స్థానిక వర్తకులు బుధవారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అన్ని వ్యాపారాల్లో పోటీకి కారణం అవుతున్నారన్నారు. స్థానికులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాల అద్దెలు పెరిగి నష్టి విరుగుతోందన్నారు.

వేతనాలు ఇవ్వాలని ఆందోళన



మక్తల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో 1560 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, నెలలు గడచినా వారికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు భద్రత పరికరాలు, వస్త్రాలు, సబ్బులు, నూనెలు ఇవ్వడం లేదన్నారు. జీవితబీమా సౌకర్యం కల్పించి త్వరలో వేతనాలు అందించాలన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నరేశ్, వెంకటేశ్, మల్లేష్, రాము, నర్సిములు, వెంకటయ్య, చంద్రప్పలు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తిక్

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో పనిచేస్తున్న మంచినీటి సహాయకులు సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ కార్తిక్ అన్నారు. బుధవారం కోస్గి మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథలో పనిచేస్తున్న మంచి నీటి సహాయకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. ట్యాంకుల శుభ్రత, పైపుల లీకేజీ, నిత్యం నీటి సరఫరా చేసే వేళలపై అవగాహన కల్పించారు. హ్యాండ్ పంప్, బోర్ మరమ్మతులే, సింగల్ , త్రీ ఫేజ్ మోటార్ల మరమ్మతులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ తూము భీంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలుకు వినతి



అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట, న్యూస్‌టుడే : సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పత్తిపంటను ప్రైవేటుగా విక్రయించుకుని నష్టపోతున్నారని, ప్రభుత్వ పరంగా కొనుగోలు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. పత్తి కొనుగోలుకు తీసుకోవాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ మార్కెటింగ్ అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, శ్యామలప్ప, వెంకటప్ప, విశ్వనాథ్‌రెడ్డి, అంజయ్యయాదవ్, లక్ష్మమ్మ, బుగ్గప్ప పాల్గొన్నారు.

ఆహారం అందరి హక్కు



మీర్జాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోస్గి, న్యూస్‌టుడే: మనకు సరిపడా ఆహారం తీసుకోవడం హక్కు అని, ఆహారం వృథా చేయడం మానుకోవాలని జాతీయ హరిత దళ పాఠశాలల సమన్వయకర్త వార్ల మల్లేషం అన్నారు. అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా బుధవారం మీర్జాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 'పౌష్టికాహారం - ఆహార భద్రత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. రోజూ తినే ఆహారంలో పోషకాలు ఉండేలా జాగ్రత్త పడాలని, వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు ప్రోత్సహించడం, పోషకాహార వ్యవస్థను అవగాహన చేసుకోవడంతో ఆహార భద్రత పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



తలపడుతున్న ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం కొనసాగాయి. మూడోరోజు పూల్ 'బి' గ్రూప్‌లో రంగారెడ్డి జిల్లా జట్టు అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌లపై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. నిజామాబాద్, రంగారెడ్డి, కరీంనగర్‌లపై నల్గొండ జిల్లా జట్టు విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. గురువారం సెమీఫైనల్‌లో పోటీలు జరగనున్నాయి.

చిన్న వర్షానికే ఊట్కూరులో చిత్తడి



మండలకేంద్రంతో పాటు మగ్దుంపూర్, నిడుగుర్తి, తిప్రాస్పల్లి తదితర గ్రామాల్లో కురిసిన వర్షాలకు మురుగు పొంగింది. ఊట్కూరులో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. కాల్వల వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో చిత్రంలో చూడొచ్చు. - న్యూస్‌టుడే, ఊట్కూరు


విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు



ఎంఈవో రాంచంద్రాచారి సమక్షంలో విధుల్లో చేరుతున్న కొత్త ఉపాధ్యాయులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆయా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు గురువారం విధుల్లో చేరారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో రాంచంద్రాచారి సమక్షంలో ధ్రువపత్రాలు సమర్పించి, పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కొత్త ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. పాఠశాలలకు వెళ్లే రహదారి తదితర అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఆయా పాఠశాలల్లో మొత్తం 20 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. 14 మంది ఎస్జీటీలు, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, ముగ్గురు భాషా పండితులు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. తపస్ నాయకులు కె.కృష్ణ, సి.గోపాల్, సి.బన్నేష్, పృథ్వీరాజ్, కిరణ్, అంబికా, లక్ష్మి, స్రవంతి, మంజుల పాల్గొన్నారు.


వ్యర్థం నుంచి సిరులు వచ్చేనా?!



కోస్గి డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త నిల్వలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే :పురపాలికల్లో స్వచ్ఛతను కాపాడటంలో భాగంగా ఆయా వార్డుల నుంచి సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించాలని భావించారు. ఉమ్మడి జిల్లాలో పలు పురపాలికలు చెత్తను సెగ్రిగేషన్ షెడ్ల ద్వారా వేరుచేసి పలు ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని కాసులు రాబడుతున్నాయి. కోస్గి పురపాలికలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజుకు 5 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నా.. షెడ్డు ఏర్పాటు చేయకపోవడం, చెత్తను వేరు చేసే ప్రక్రియకు ప్రణాళిక లేకపోవడంతో సేకరించిన చెత్తంతా బుగ్గిపాలవుతోంది. ఈ విషయమై పర్యావరణ ఇంజినీర్ విజయభాస్కర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సెగ్రిగేషన్ షెడ్డు ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. త్వరలో టెండర్ పిలుస్తామన్నారు.

ఆసియా నెట్‌బాల్ పోటీలకు అధికారిగా రామ్మోహన్



ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడకు చెందిన వ్యాయామ విద్య సంచాలకుడు డాక్టర్ మాధారం రామ్మోహన్‌గౌడ్ 13వ మహిళా ఆసియా నెట్‌బాల్ పోటీలకు సాంకేతిక అధికారిగా నియమితులయ్యారు. 17 నుంచి 27 వరకు బెంగళూరులో పోటీలు జరుగుతాయి. ప్రస్తుతం ఈయన కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో పీడీగా పని చేస్తూ నెట్‌బాల్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

గ్రామాలకు బస్సులు నడిపించాలి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : జిల్లాలోని గ్రామాలకు బస్సు సర్వీసులు నడిపించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పేట ఆర్టీసీ కార్యాలయంలో సంబంధిత అధికారికి వినతిపత్రం అందించారు. దసరా పండగ పూర్తయినప్పటికీ గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు రావడంలేదని గుర్తుచేశారు. విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో బస్సులు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ: ముగ్గురికి గాయాలు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : దామరగిద్ద మండలం పిడెంపల్లి గ్రామంలో స్పీడ్ బ్రేకర్ విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం బుధవారం మధ్యాహ్నం రోడ్డుపై ద్విచక్ర వాహనం అతి వేగంగా వెళ్లడంతో ఓ వర్గానికి చెందిన యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు అక్కడే ప్రమాదం నివారణ కోసం స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసేందుకు రోడ్డుపై గుంతలు తవ్వారు. అటుగా వస్తున్న మరో వర్గం వారు ఇక్కడ స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయకూడదని వాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి కొట్టుకున్నారు. ముగ్గురికి గాయాలు కావడంతో పేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని మూలమల్ల గ్రామంలో బుధవారం పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కృష్ణా జలాలతో సంప్రోక్షణ, అభిషేకం, అలంకారోత్సవం, పాండురంగ స్వామి, రుక్మిణి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆభరణాలను ఊరేగించారు. గురువారం రథోత్సవం జరగనుంది. ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, భజన మండలి అధ్యక్షుడు భగవంత్‌రెడ్డి, ఆయా నిర్వాహక కమిటీల బాధ్యులు పర్యవేక్షించారు.